క్లుప్తంగా

పశువుల దాణా పంపిణీ



నారాయణలంకలో పశువుల దాణాను పంపిణీ చేస్తున్న తోట పృథ్వి, ప్రజాప్రతినిధులు

కపిలేశ్వరపురం: మండలంలోని నారాయణ లంక, కేదారిలంక, వీధివారిలంక, అద్దంకివారిలంక, పల్లపులంక గ్రామాల పాడి పశువులకు ప్రభుత్వం ఉచితంగా పశువుల దాణాను మంజూరు చేసింది. వాటిని పాడి రైతులకు జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎమ్మెల్సీ తనయుడు, వైఎస్సార్ సీపీ యువ నేత తోట పృథ్వీరాజ్, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్ చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు, నాయకులు అంగాని నూకరాజు, బొక్కా రాంబాబు, లంక గ్రామాల రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ కంచాల పంపిణీ



కంచాలు అందిస్తున్న రామచంద్రపురం మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి తదితరులు

రాయవరం: దాతల సేవలు వినియోగించుకుని, మరింత విద్యాభివృద్ధి సాధించాలని రామచంద్రపురం మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అన్నారు. పసలపూడి సొసైటీ చైర్మన్ చింతా రామ్మోహన్‌రెడ్డి సౌజన్యంతో మధ్యాహ్న భోజనం చేసేందుకు వీలుగా పసలపూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం స్టీలు కంచాలు బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం నూలు ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి కోట్లాది రూపాయలను వెచ్చిస్తుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమానికి, అభివృద్ధికి దాతల సహకారం తోడైతే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం రూ.10 వేల విలువైన 100 స్టీలు కంచాలను విద్యార్థులకు బహూకరించారు. వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు గాదంశెట్టి శ్రీధర్, పోతంశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

400 మందికి దంత పరీక్షలు



కుయ్యేరులో రోగులను పరీక్షిస్తున్న కిమ్స్ కళాశాల దంత వైద్యులు

కాజులూరు: కుయ్యేరులో సోమవారం అమలాపురం కిమ్స్ కళాశాల నుంచి దంత వైద్యులు వచ్చి ఉచిత దంతవైద్య శిబిరాలను నిర్వహించారు. సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో 15 మంది దంత వైద్యులు గ్రామ సచివాలయం, కుయ్యేరు శివారు గ్రామాలైన చింతనలంక, నల్లచెరువుపుంత, రేగుబడవల్లోనూ, జెడ్పీ ఉన్నత పాఠశాల్లోనూ విడివిడిగా వైద్య శిబిరాలు నిర్వహించి రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు సరఫరా చేసి పాఠశాల చిన్నారులకు దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలంటూ ధర్నా

మండపేట: అసంపూర్తిగా నిలిపివేసిన మండపేట–ద్వారపూడి రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ బీజేపీ, జనసేన పార్టీల నాయకులు సోమవారం తాపేశ్వరం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు, కోన సత్యనారాయణ మాట్లాడుతూ అసంపూర్తి పనులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జనసేన, బీజేపీ నాయకులు కుంచే ప్రసాద్, కోటిపల్లి సాయిరాం, పాట్నూరి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

ఆలమూరు: ఇటీవల మండలంలోని చెముడులంకలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన ఇరువురు బాధిత కుటుంబాలకు గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు సాయం అందజేశారు. గ్రామంలో జరిగిన ఈ విషాద సంఘటనను ప్రచార మాధ్యమాల్లో తెలుసుకున్న చెముడులంక జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు స్పందించి విరాళాలను అందజేశారు. విరాళాల ద్వారా సేకరించిన రూ.44 వేలను సోమవారం బాధిత కుటుంబాలకు అందజేశారు. అలాగే స్థానికంగా నివాసముంటున్న పూర్వ విద్యార్థులైన దూలం శ్రీనివాస్, అన్నందేవుల సతీష్, డాక్టర్ వడ్డి శ్రీనివాస్, గుంగుమళ్ల సాయి, కొండ్రెడ్డి శ్రీనివాస్ తదితరులు బాధితులకు గ్యాస్ స్టవ్‌లు, సిలిండర్లు, వంట పాత్రలను అందజేశారు.

బుస్... కాటేస్తాయి

- గోదావరి తీర గ్రామాల్లో విష సర్పాల సంచారం
- కంగారెత్తిపోతున్న ప్రజలు
- పీహెచ్‌సీల్లో అందుబాటులో యాంటీ స్నేక్ వీనం



వైద్యాధికారి పి.రత్నకుమారి

కపిలేశ్వరపురం: వరద గోదావరి ఉరకలేస్తోంది. నీటి ఉధృతిని తగ్గించేందుకు వరద నీటిని పంట కాలువల్లోకి మళ్లించారు. దీంతో గ్రామాల్లోని కాలువలు, బోదెలు వరద నీటితో నిండి ఉన్నాయి. దీంతో విష సర్పాల సంచారం అధికమైంది. సాధారణంగా వ్యవసాయ క్షేత్రాలకే పరిమితం అయ్యే పాముల సంచారం వరద నీటి ప్రవాహంతో నివాసిత ప్రాంతాలకు కూడా చేరుతున్నాయి. చిరుజల్లుల వాతావరణం సరీసృపాల సంచారానికి అనుకూలంగా ఉండడంతో పాముల బెడద తీవ్రంగా ఉంది. కనిపించిన పాములు రెప్పపాటులో అదృశ్యమవుతున్నాయని తీర గ్రామాల ప్రజలు అంటున్నారు. పాము కాటు వల్ల కలిగే ప్రమాదాలు, చికిత్స విధానం, ఆస్పత్రుల్లో చికిత్స తీరు తదితర అంశాలపై అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి చెప్పిన విషయాలిలా...



కపిలేశ్వరపురంలోని ఇంటిలోకి ప్రవేశించిన తాచు పాము (ఫైల్)

గ్రామాల్లో పరిస్థితి ఇలా...

కపిలేశ్వరపురం మండలం నల్లూరులో 2021 నవంబర్ 29న పాము కరవడంతో ఇంటి ఆవరణలో ఆడుకొంటున్న ఆరేళ్ల బాలుడు బి.నాగేంద్ర మృతి చెందాడు. గతంలో కోరుమిల్లి గోదావరి గట్టుపై పచ్చ గడ్డి కోస్తుండగా గ్రామానికి చెందిన వృద్ధుడు సుంకర నాగేశ్వరరావు పాము కాటుకు గురై చనిపోయారు. నల్లూరులోని చిన్నారిని విష సర్పం కరవడంతో అంగర పీహెచ్‌సీలో చికిత్స చేశారు. క్షేత్రస్థాయిలో విష సర్పాల ప్రభావానికి అనేక మందికి గురవుతున్నారు. ఎటు వెళ్తున్నా ఎక్కడ పాము నక్కి ఉందో అన్న భ్రాంతితో ప్రజలు హడలి పోతున్నారు. కె.గంగవరం మండలం శేరిలంక, కపిలేశ్వరపురం మండలం అద్దంకివారిలంక, కేదారిలంక, పల్లపులంక, నారాయణలంక, వీధివారిలంకలు పూర్తిగా గోదావరిలో ఉన్నాయి. వ్యవసాయ క్షేత్రాల్లో నేటికీ వరద నీరు ఉంది. కోరుమిల్లి, వాకతిప్ప, కపిలేశ్వరపురం, తాతపూడి, శేరిలంక, కోటిపల్లి, కూళ్ల శివారు ప్రాంతాల్లో విష సర్పాల సంచారం ఎక్కువగా ఉంది. వాకతిప్ప, అచ్యుతాపురం, అంగర, వానపల్లి, కొత్తపేట పీహెచ్‌సీలలో యాంటీ స్నేక్ వీనం మందు అందుబాటులో ఉన్నట్టు ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు తెలిపారు. కపిలేశ్వరపురంలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో యాంటీ స్నేక్ వీనం మందు అందుబాటులో ఉందని చికిత్స అవసరమైనవారికి ఉచితంగా ఇస్తామని ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు.

పాముకాటు లక్షణాలు

కరిచిన పామును బట్టి బాధితునిలో లక్షణాలు కనిపిస్తాయి. కాటు సమయంలో బాధితుడి శరీరంలోకి ఎక్కిన విషం పరిమాణాన్ని బట్టి ప్రమాద తీవ్రత ఉంటుంది. నల్ల తాచు అయితే విష ప్రభావం త్వరితంగానూ, సాధారణ తాచుపాము ప్రభావం కాస్త ఆలస్యంగానూ ఉంటుంది. విష సర్పం కాటు వేసిన ప్రదేశంలో కోరల గాయాలు స్పష్టంగా కనిపిస్తాయి. నొప్పి క్రమక్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది. పాక్షిక పక్షవాతం కారణంగా నాలుక మందమైనట్టు, గొంతు కండరాలు బిగుసుకుపోతాయి. గొంతులో ఏదీ దిగని పరిస్థితి తలెత్తుతుంది. చొంగ కారవచ్చు. కళ్లు మగతగా, శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోవచ్చు.

ప్రథమ చికిత్స

పాము కాటు పైభాగంలో కట్టు కట్టాలి. ఆస్పత్రికి తీసుకెళ్లే లోపు ఆలస్యమవుతుంటే మధ్యమధ్యలో కట్టును వదులు చేసి మళ్ళీ కడుతుండాలి. కాటు వద్ద విషాన్ని పిండాలి. గుండె వేగం పెరగకుండా జాగ్రత్త పడాలి. కాటు వేసిన శరీర భాగాన్ని గుండె కంటే కిందికి ఉండేలా ఉంచాలి. కాటుకు గురైన వ్యక్తి నిద్రపోతే అపస్మారక స్థితికి చేరుకునే ప్రమాదం ఉంది. మెలకువగానే ఉంచి త్వరితగతిన ఆస్పత్రికి తరలించాలి. విషానికి విరుగుడైన ఏఎస్‌యూ (యాంటీ స్నేక్ వీనం) మందు ఉండే స్థాయి గల ఆస్పత్రికి తరలించేలా ఆలోచన చేయాలి.

ఆస్పత్రిలో చికిత్స ఇలా...

కాటు వేసిన సర్పం విషపూరితమైనదా కాదా అన్న విషయాన్ని నిర్ధారించుకునేందుకు వైద్యుడు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి. తీవ్రతను బట్టి విషం విరుగుడు మందు ఏఎస్‌యూ (యాంటీ స్నేక్ వీనం)ను ఇంజక్షన్ రూపంలో ఇస్తారు. బాధితునికి శక్తి కలిగేందుకు సెలైన్ ఇస్తూ ఇతర ఆరోగ్య సమస్యలు రాకుండా చికిత్స అందజేస్తారు. మరణం సంభవిస్తే మెడికో లీగల్ కేసు కింద అధికారికంగా నమోదు చేస్తారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఆర్యావటంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

కాజులూరు: కాకినాడ, కోటిపల్లి రహదారిలో ఆర్యావటం సాయిబాబా గుడివద్ద ఒక కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. అయితే సకాలంలో కారులోని ఎయిర్‌బ్యాగ్స్ తెరచుకోవటంతో అందులో ప్రయాణిస్తున్న యువకులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఈ సంఘటనకు సంబంధించి సోమవారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ద్రాక్షారామకు చెందిన నలుగురు యువకులు కాకినాడకు కారులో వేగంగా వెళుతూ సాయిబాబా గుడి వద్ద మలుపులో అదుపుతప్పి రోడ్డుపక్కల ఉన్న విద్యుత్ స్తంభాలను ఢీకొట్టారు. దీంతో స్తంభాలు ముక్కముక్కలుగా విరిగి వైర్లు తెగి పడ్డాయి. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. అయితే సకాలంలో కారులోని ఎయిర్ బ్యాగ్స్ తెరచుకోవటంతో అందులో ప్రయాణిస్తున్న యువకులకు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అయితే ఈ సంఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదులు అందలేదని గొల్లపాలెం పోలీసులు తెలిపారు.

అభివృద్ధి పనులకు కౌన్సిల్ పచ్చజెండా

- రూ.59 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టు పనులు
- ప్రశాంతంగా మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: పట్టణంలో కొత్తగా చేపట్టే పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. చైర్‌పర్సన పతివాడ దుర్గారాణి అధ్యక్షతన సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సుమారు రూ.59 లక్షల వ్యయంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టు పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన ఈ పనులు పూర్తి చేయాలని చైర్‌పర్సన్ దుర్గారాణి అధికారులను ఆదేశించారు. వ్యాపారంలో నష్టం వస్తున్నందున తమకు కేటాయించిన మున్సిపల్ షాపులను రద్దు చేయాలని నలుగురు వ్యాపారుల అభ్యర్థన మేరకు వారి లీజును రద్దు చేస్తూ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. అనంతరం చైర్‌పర్సన్ దుర్గారాణి పట్టణంలో సమస్యల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను వివరించారు.

పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించాలి

ప్రస్తుతం వర్షాల సీజన్ దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేసేందుకు సభ్యులు, అధికారులు కృషి చేయాలని చైర్‌పర్సన్ దుర్గారాణి కోరారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు మున్సిపాలిటీ ద్వారా డ్రైన్లలో లార్వా నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విష జ్వరాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే కరపత్రాలు ముద్రించి పట్టణంలోని ప్రతి ఇంటికీ అతికించే కార్యక్రమం జరుగుతోందన్నారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణకు ప్రజలు తమ వంతు తోడ్పాటు అందించాలని చైర్‌పర్సన్ కోరారు. ఇంటి పరిసరాలు, ఖాళీ డ్రమ్ములు, టైర్లు, ఇతర సామగ్రిలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనివార్య కారణాలతో ఎక్స్ ఆఫీషియో సభ్యులైన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమావేశానికి హాజరు కాలేకపోయారు. మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, కోఆప్షన్ సభ్యుడు రెడ్డి రాజుబాబు, వైస్ చైర్మన్లు పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నారయ్య, విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

పంట భూములు జలమయం

- నివాసిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు
- లంక గ్రామాలను సందర్శించిన ప్రజాప్రతినిధులు



జలమయమైన కేదారిలంక ఇటుక బట్టీల ప్రాంతం



కోటిపల్లి రేవులో ఫెర్రీ వద్ద మూడడుగుల మేర తగ్గి ప్రవహిస్తున్న గోదావరి



కేదారిలంక ఫెర్రీ వద్ద బారికేడ్ ఏర్పాటుపై చర్చిస్తున్న తహసీల్దార్ సూర్యారావు



కోటిపల్లిలోని పునరావాస కేంద్రం వద్ద బాధితులకు భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం



వరద నీటిలో ఉన్న కోటిపల్లి మత్స్యకార కాలనీ

కపిలేశ్వరపురం: గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. వ్యవసాయ క్షేత్రాలు నీటిలో మునిగి ఉన్నాయి. ఇటుక బట్టీల్లోని ఆవలు, కార్మికుల తాత్కాలిక నివాసాలు ముంపు బారిన పడ్డాయి. కేదారిలంక గ్రామంలోని మత్స్యకారుల నివాస ప్రాంతాలు జలమయం అయ్యాయి. కేదారిలంక ఫెర్రీ ప్రాంతం ప్రమాద భరితమైనది కావడంతో నదిలోకి వెళ్లకుండా బారికేడ్లు నిర్మించారు. అంగర పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. వరద ప్రభావిత గ్రామాలైన అద్దంకివారిలంక, పల్లపులంక, కేదారిలంక, నారాయణలంక, వీధివారిలంక గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది పడవలపై ఇంటింటికీ వెళ్ళి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్నారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పనితీరును తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి పరిశీలించారు. వారి చేతుల మీదుగా ఉచిత మందులను పంపిణీ చేశారు. కార్యదర్శి సీహెచ్ నరసింహారావు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య చర్యలు చేపట్టారు. విశాఖ, విజయనగరం ప్రాంతాలకు చెందిన ఇటుక బట్టీ వలస కార్మికులు పునరావాస కేంద్రాల్లో తల దాచుకునే ఏర్పాట్లు చేశారు. బట్టీలు మూతపడడంతో వారికి తాగునీరు, ఆహార పదార్థాలను అందజేస్తున్నారు. తహసీల్దార్ సూర్యారావు, ఎంపీడీఓ రామకృష్ణ, కార్యదర్శి నరసింహారావులు ఇటుక బట్టీ ప్రాంతాలను సందర్శించారు. లంక గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలను, నివాసిత ప్రాంతాలను ఎమ్మెల్సీ తనయుడు, వైఎస్సార్ సీపీ యువ నేత తోట పృథ్వీరాజ్, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, వైఎస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, సర్పంచ్ వీధివెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామాల అధ్యక్షులు పోలిశెట్టి గణేష్ , కొండేటి వెంకటేశ్వరరావు పర్యటించారు.

మూడు అడుగుల మేర తగ్గిన గోదావరి

కె.గంగవరం: ఉగ్రరూపం దాల్చిన గోదావరి సోమవారం ఉదయం నుంచి తగ్గుముఖం పట్టింది. ఆదివారంతో పోలిస్తే మూడు అడుగుల మేర వరద ఉధృతి తగ్గిందని రెవెన్యూ సిబ్బంది చెబుతున్నారు. వరద ఉధృతి తగ్గుతుండడంతో గోదావరి పరీవాహక ప్రజలు, ముంపు గ్రామ ప్రజలు కొంత వరకు ఉపశమనం పొందారు. కోటిపల్లిరేవులోని ఫెర్రీ వద్ద పుష్కరఘాట్‌ల చివరి వరకు ప్రస్తుతం వరదనీరు ప్రవహిస్తుంది. మత్స్యకార కాలనీలోని మూడు పేటు ఇంకా జల దిగ్బంధలోనే ఉండిపోయాయి. గోదావరి ఉధృతి ఎక్కువగా ఉండడంతో సోమవారం కూడా పంటు ప్రయాణాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు నిలిపివేశారు. పూర్తి స్థాయిలో వరదనీరు తగ్గిన తరువాతే పంటు ప్రయాణానికి అనుమతిస్తామని వారు తెలిపారు. ముక్తేశ్వరం రేవు వద్ద గోదావరి పాయలో ఏర్పాటు చేసిన తూరలు ఎన్నడూ లేని విధంగా వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. దీంతో పాటు సుమారు అరకిలోమీటరు మేర తాత్కాలికంగా ఏర్పాటు చేసి కంకర రోడ్డు కూడా వరద ఉధృతికి కొట్టుకుపోయింది.

కొనసాగుతున్న గస్తీ..

కోటిపల్లి రేవుతో పాటు మత్స్యకార కాలనీ, మసకపల్లి నుంచి కూళ్ల వద్ద వరకు గల ఏటిగట్టుపై వలంటీర్లు, పోలీసులు, రెవెన్యూ గస్తీ కొనసాగుతుంది. అనుమతి లేకుండా గోదావరిలోకి ఎటువంటి నాటు పడవలు వెళ్లకుండా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. గోదావరి ఉధృతి తగ్గేంత వరకు గస్తీ ఉంటుందని స్థానిక తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ తెలిపారు. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు పల్లపుప్రాంత ప్రజలు, గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న పునరావాస కేంద్రం

కోటిపల్లిలోని మత్స్యకారులకు చెందిన మూడు కాలనీలు వరద నీటిలో నానుతున్నాయి. ఏటిగట్టు పక్కనే ఉన్న సుమారు 100 పూరిగుడెసలు, పెంకుటిళ్లలోకి వరద వచ్చి చేరింది. మిగిలిన మత్స్యకార కాలనీల్లోని ఇళ్లను వరద చుట్టుముట్టింది. బాధితులకు అప్రమత్తం చేసి స్థానికంగా ఉన్న ప్రాథమిక పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. సోమవారం కూడా పునరావాస కేంద్రం వద్ద ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం భోజనాలను వండి వడ్డిస్తున్నారు. పునరావాస కేంద్రానికి రాని బాధితులకు వలంటీర్ల సాయంతో ఆహార పొట్లాలు, నీరు అందిస్తున్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

రామచంద్రపురం: విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యులు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ గౌరవాధ్యక్షుడు రాయసం ఆదిశేషువిటల్ బాబుని కిడ్నాప్ చేసి దారుణంగా హత్య చేసినందుకు నిరసగా రామచంద్రపురం బార్ అసోసియేషన ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం కోర్టు విధులను బహిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న బార్ అసోసియేషన్ కార్యదర్శి వాడ్రేవుసాయిప్రసాద్, ఉపాధ్యక్షులు డీఎస్ఎస్ శర్మ, పలివెల సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ న్యాయవాదులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులపై దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరుతూ నినాదాలు చేశారు. దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సంయుక్త కార్యదర్శి వీర్రెడ్డి, జూనియర్ న్యాయవాదుల ప్రతినిధి పిల్లా రామయ్య, మహిళా న్యాయవాదుల ప్రతినిధి పలివెల సత్యవాణి, న్యాయవాదులు డీపీ శాస్త్రి, పోలిశెట్టి శ్రీనివాస్, కె భరత్‌కుమార్, దొమ్మలపాటి సత్యనారాయణ, నీలం మధుసూదనరావు, కేవీవీ సత్యనారాయణ, చోడే జాన్‌రత్నం తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.



బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ప్రభుత్వ పథకాల అమలుకు కృషి చేయాలి

సాదాసీదాగా కాజులూరు మండల సమావేశం



మండల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకట సుబ్బారావు

కాజులూరు: ప్రభుత్వ పథకాల అమలుకు స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు తమ వంతు కృషి చేయాలని జెడ్పీటీసీ వనుం వెంకటసుసుబ్బారావు అన్నారు. కాజులూరు మండల పరిషత్ సమావేశ భవనంలో సోమవారం ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వివిధ శాఖల అధికారులు వారి శాఖల తరఫు/న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పురోగతిని సభ్యులకు వివరించారు. హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీల్లో ప్రతి లబ్ధిదారునికి ఇల్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, ప్రభుత్వ రుణ సహాయంతో సొంతంగా ఇల్లు కట్టుకోలేని వారికి షేర్ వాల్ టెక్నాలజీతో ఇల్లు నిర్మిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకొనేలా నాయకులు కృషి చేయాలన్నారు. అనంతరం మండల వ్యవసాయాధికారి వి.అశోక్ మాట్లాడుతూ మండల గ్రామాల్లో తొలకరి వరి నాట్లు దాదాపు పూర్తి కావచ్చాయన్నారు. తూర్పు డెల్టా కాలువల నుంచి సాగునీరు పుష్కలంగా పొలాలకు చేరుతుందని చెదురుమదురు వర్షాలతో నాట్లు దశకు వాతావరణం అనుకూలంగా ఉందన్నారు. గొల్లపాలెం, కుయ్యేరు రహదారి నిర్మాణం పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చూడాలని సభ్యులు అడిగిన ప్రశ్నకు జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు సమాధానమిస్తూ 13 కిలోమీటర్లు ఉన్న ఈ రహదారిలో రోడ్డు నిర్మాణంతో పాటు మూడు వంతెనలు, 50కి పైగా కల్వర్టులు నిర్మించాల్సి ఉందన్నారు. దాదాపు కల్వర్టులు, రోడ్డు వెడల్పు పనులు పూర్తయ్యాయని త్వరలో రోడ్డు నిర్మాణం పూర్తవుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు, ఎంపీడీఓ ఐ.రత్నంరాజు, వైస్ ఎంపీపీలు రేఖాడి విజయ, పెద్దిరెడ్డి వెంకటరమణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

అమలాపురం రూరల్: స్థానిక ఆర్టీసీ డిపోలో కార్మికులను ఇబ్బంది పెడుతున్న పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ద ఏపీఎస్ పీటీడీ జేఏసీ కమిటీ అమలాపురం డిపో శాఖ డిపో మేనేజర్‌కు సోమవారం విజ్ఞప్తి చేసింది. ఐదు అంశాలతో కూడిన సమస్యలను ఆ కమిటీ ప్రతినిధులు డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తికి వినతి పత్రం ద్వారా తెలియజేశారు. కమిటీ ప్రతినిధులు పి.రాంబాబు, ఎస్ఎస్‌వీ గణేష్, ప్రసాద్, దొరబాబు, పీఎన్‌కేడీ రావు, మణిరాజు, కేవీవీఎస్ నారాయణ, సీహెచ్ రావు, జంగా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ డిపోలో సమస్యలపై చర్చిస్తున్న కమిటీ ప్రతినిధులు

స్పందనలో 6 అర్జీలు

రామచంద్రపురం: రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో మొత్తం 6 అర్జీలు వచ్చినట్లు కార్యాలయం సిబ్బంది ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆక్రమణల తొలగింపు 2, భూ సర్వే నిమిత్తం 3, ఆపరేటర్ వాహన రిజిస్ట్రేషన్ మార్పు కొరకు 1 అర్జీలు అందినట్లు తెలిపారు.

రామిశెట్టి కుటుంబానికి పృథ్వీరాజ్ పరామర్శ

మండపేట: మండలంలోని ఏడిదకు చెందిన వైఎస్సార్ సీపీ నేత రామిశెట్టి వీర్రాజు మృతితో తీవ్ర విషాదంలో ఉన్న ఆయన కుటుంబ సభ్యులను సోమవారం పార్టీ యువనేత తోట పృథ్వీరాజ్ పరామర్శించారు. ఏడిదలోని వీర్రాజు స్వగృహానికి వెళ్లి ఆయన చిత్ర పటానికి పృథ్వీరాజ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, సంగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ రామ్ శెట్టి శ్రీనివాస్, వార్డు సభ్యుడు కొండేటి కాళీకృష్ణ తదితరులు పరామర్శించారు.

పిచ్చికుక్క దాడిలో ఏడుగురికి గాయాలు

మలికిపురం: మండలంలోని రామరాజులంకలో సోమవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గ్రామంలో మొత్తం ఏడుగురిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. చర్చిపేటలో ఆరేళ్ల బాలిక దాకే కేథరిన్‌తో పాటు, పెదతిప్పలో ఒక మహిళను గాయపరిచినట్లు గ్రామానికి చెందిన రాపాక చిట్టిబాబు తెలిపారు. గాయపడిన వారందరూ చికిత్స నిమిత్తం రాజోలు ప్రభుత్వాసుపత్రిలో చేరారు. పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకుని పిచ్చికుక్కను అరికట్టాలని గ్రామస్తులు కోరారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

రాయవరం: మండలంలోని కురకాళ్లపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. దాత డీఆర్‌సీ రెడ్డి సౌజన్యంతో నిర్వహించిన నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి శారద, ఎంపీటీసీ సభ్యురాలు వాసంశెట్టి వెంకటలక్ష్మి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కురుపూడి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.